# సీపీఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శిగా పంజాల

**శెనార్తి మీడియా, కరీంనగర్:**

భారత కమ్యూనిస్టు పార్టీ కరీంనగర్ జిల్లా 23వ మహాసభలు రెండు రోజుల పాటు నగరంలోని లక్ష్మీ నగర్ లో గల మధు గార్డెన్ లో జరిగాయి.ఈ మహాసభల కు ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్య దర్శి కొత్తగూడెం శాసనసభ్యులు కూనం నేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్ హాజర య్యారు. జిల్లా మహాసభలో నూతన కార్య వర్గం కౌన్సిల్ ఎన్నిక జరిగింది. 14 మంది తో కార్యవర్గం 35 మందితో కౌన్సిల్, ఐదుగురు క్యాండిడేట్ సభ్యులు నలుగురు ఆహ్వానితులను మహాసభలో ఎన్నుకోవడం జరిగిందని, జిల్లా కార్యదర్శిగా పంజాల శ్రీనివాస్ ఎన్నికైె నట్లు రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్ ప్రకటించారని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు,తాజా మాజీ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి తెలిపారు.



### సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ బయోడేటా

పంజాల శ్రీనివాస్ 1983 మే 5న కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలంలోని చెల్పూర్ గ్రామంలో జన్మించారు. తండ్రి పేరు మల్లయ్య. విద్యార్హత ఎంబీఏ.

**రాజకీయ ప్రస్థానం:** 2003లో అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్)లో చేరారు.2004లో ఏఐఎస్ఎఫ్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.2005లో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు. 2010లో అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.2012లో ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.ఉమ్మడి కరీంనగర్ జిల్లా సీపీఐ కార్యవర్గ సభ్యుడిగా పని చేశారు.2018లో సీపీఐ కరీంనగర్ నగర కార్యదర్శిగా ఎన్నికయ్యారు.జిల్లాల పునర్విభజన అనంతరం కరీంనగర్ జిల్లా సీపీఐ కౌన్సిల్ సభ్యుడిగా, కార్యవర్గ సభ్యుడిగా బాధ్యతలు నిర్వహించారు.2025 మే 27, 28 తేదీల్లో మధు గార్డెన్‌లో జరిగిన సీపీఐ 23వ మహాసభలో సీపీఐ జిల్లా కార్యదర్శిగా ఎన్నికయ్యారు.

## 'తుమ్మడిహెట్టి' వివాదం..

# నేతల మాటల యుద్ధం





**శెనార్తి మీడియా, ఉమ్మడి ఆదిలాబాద్:**

సిర్పూరు నియోజకవర్గంలో తుమ్మడి హెట్టి ప్రాజెక్టు దోపిడీ అంశం కొత్త వివాదాలకు దారితీసింది. ప్రాజెక్టుపై బహిరంగ చర్చకు రావాలంటూ మంగళవారం సిట్టింగ్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్పకు సవాల్ విసిరారు. ఈ సవాల్‌ను కోనప్ప స్వీకరించడంతో, బుధవారం ఉదయం 11 గంటలకు తుమ్మడిహెట్టి వద్ద బహిరంగ చర్చ జరుగుతుందని భావించారు. అయితే పోలీసుల జోక్యంతో ఇరు నేతలు ప్రాజెక్టు వద్దకు చేరుకోలేక పోయారు.

**నీటి తరలింపుపై హరీష్ ఆరోపణలు..**

ఎమ్మెల్యే పల్వాయి హరీష్ బాబు మాట్లాడుతూ.. తుమ్మడిహెట్టి ప్రాజెక్టు నీళ్లు సిద్ధిపేటకు తరలిపోతుంటే కోనేరు కోనప్ప తిలకించుకుంటూ ఊరుకున్నారని విమర్శించారు. ప్రాజెక్టును కాళేశ్వరానికి తరలించినప్పుడు కూడా కోనప్ప ఎలాంటి చర్యలు తీసుకోలేదని, ఆయన కారణంగా సిర్పూరుకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు.

**ప్రతిసవాల్‌తో కోనప్ప స్పందన**

మరోవైపు కోనేరు కోనప్ప మాట్లాడుతూ.. తుమ్మడిహెట్టి వద్ద ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును అడ్డుకోవడంలో హరీష్ కుటుంబమే ప్రమేయముందని ఆరోపించారు. పల్వాయి హరీష్ తల్లి గతంలో ధర్నాలు నిర్వహించారని, అందుకు కారణంగా ప్రాజెక్టు ఆలస్యానికి పాల్పడినట్లు ఆరోపణలు చేశారు.

**బహిరంగ చర్చకు పోలీసుల అడ్డంకి..**


బహిరంగ చర్చకు ఇద్దరు నేతలు సిద్ధమవుతున్న తరుణంలో, పోలీసులు ఇద్దరికీ ప్రాజెక్టు వద్దకు వెళ్లకుండా అడ్డంకులు కల్పించారు. హరీష్ బాబును ఇంటి వద్దనే నిలిపివేసి, కోనప్పను మరోవైపు ముందుకు సాగనివ్వలేదు. ప్రస్తుతానికి ఇరు నేతల గృహాల వద్ద పోలీసులు మోహరించారు.

**స్థానికంగా ఉద్రిక్త వాతావరణం..**

ఇరువురు నేతల మధ్య మాటల యుద్ధం స్థానికంగా పెద్ద చర్చకు దారితీసింది. ప్రాజెక్టుపై నేటి రాజకీయ వ్యూహాలు మరింతగా వేడెక్కుతున్నాయి. ఈ వివాదం ఎలా పరిష్కారమవుతుందో చూడాలి.

# మంత్రి పదవి కోసం పట్టు

**బెట్టు చేస్తున్న మంచిర్యాల, చెన్నూర్ ఎమ్మెల్యేలు.. ఏఐసీసీ పరిశీలకురాలు మీనాక్షి రాజన్ పై ఒత్తిడి**




**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

కాంగ్రెస్ పార్టీలో మంత్రి పదవి కోసం చెలరేగిన పోరు రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చగా మారింది. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు, చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ ముందు తమ విన్నపాలను ఉంచారు. ఇద్దరూ తమకు కేబినెట్‌లో చోటు కల్పించాలంటూ కోరడంతో పరిస్థితి ఉత్కంఠగా మారింది.

**ఆదిలాబాద్ నేతలతో కీలక సమావేశం..**

మీనాక్షి నటరాజన్ ఆదిలాబాద్ జిల్లాలోని నేతలతో హైదర్ గూడ క్యాంపు కార్యాలయంలో సమావేశమయ్యారు. పార్టీలో పదవులు, పార్టీ స్థితిగతులపై చర్చిస్తూ, ప్రతి నేతతో 10 నిమిషాల పాటు విభిన్న అంశాలను తెలుసుకు న్నా రు. జిల్లా అధ్యక్ష పదవి కావాలని ఆది లాబాద్ ఇంచార్జ్ కంది శ్రీనివాస్ కోరగా, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు తనకు మంత్రి పదవి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

**వివేక్ అభ్యర్థన..**

చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ కూడా తన నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి చేసిన కృషిని ప్రస్తావిస్తూ, మంత్రి పదవిని కోరారు. ప్రేమ్ సాగర్ రావు, వివేక్ వెంకటస్వామి ఇద్దరి విన్నపాలు మీనాక్షి దృష్టికి రావడంతో ఆమె ఎవరి వైపుకు మొగ్గు చూపుతారనే దానిపై ఆసక్తి పెరిగింది.

**ఆదిలాబాద్ జిల్లాలో కాంగ్రెస్ బలహీనతపై ప్రశ్నలు..**

ఆదిలాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ఎందుకు వెనుకబడిందన్న అంశాన్ని మీనాక్షి నటరాజన్ ప్రధానంగా ప్రస్తావించారు. గత ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడం, స్థానిక నేతల మధ్య సమన్వయం లేకపోవడం వంటి అంశాలపై నేతల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్‌కు ప్రత్యర్థి పార్టీ బీఆర్ఎస్సా, బీజేపీనా అనే విషయంలో స్పష్టతకు రావాలని సూచించారు.

**ప్రజాసేవ పథకాలపై సమీక్ష..**

ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి ఎలా చేరుతు న్నాయన్న దానిపై మీనాక్షి నటరాజన్ సమీక్షించారు. సన్నబియ్యం, యువ వికాసం వంటి పథకాలు ప్రభుత్వానికి మంచి పేరు తెస్తున్నాయని, వీటిని పార్టీకి అనుకూలంగా ఉపయోగించుకోవాలని నేతలకు సూచించారు.

**ఏఐసీసీ ఇంచార్జ్ దృష్టి..**

మీనాక్షి నటరాజన్ నేతల అభిప్రాయాలను రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు నివేదిస్తానని స్పష్టం చేశారు. పార్టీలో సమన్వయ సమస్యలను తొలగించడం, బలమైన వ్యూహాలతో ముందుకెళ్లడమే ప్రస్తుత లక్ష్యమని ఆమె తెలిపారు. మంత్రి పదవి ఆశతో మంచిర్యాల, చెన్నూర్ ఎమ్మెల్యేల పోరు, జిల్లాలో పార్టీ పునర్నిర్మాణానికి మీనాక్షి నటరాజన్ తీసుకుంటున్న చర్యలు కాంగ్రెస్ కార్యకలాపాల్లో కొత్త మలుపు తీసుకురానున్నాయి.

## టికెట్ల కోసం హెచ్‌సీఏ బెదిరింపులు

**సన్‌రైజర్స్‌పై ఒత్తిడి, విజిలెన్స్ నివేదికలో వెల్లడి**

**హైదరాబాద్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) మ్యాచ్‌ల టికెట్ల విషయం లో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. టికెట్ల కేటాయింపుపై సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీతో జరిగిన వివాదంపై రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిన విజిలెన్స్ విచారణలో సంచలన విషయాలు బయటపడ్డాయి.విచారణలో హెచ్‌సీఏ సెక్రటరీ జగన్మోహన్‌రావు టికెట్ల కోసం ఫ్రాంచైజీ యాజమాన్యంపై ఒత్తిడి తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ప్రతి మ్యాచ్‌కు 10 శాతం టికెట్లు ఉచితంగా ఇచ్చే వ్యవస్థ ఉన్నప్పటికీ, మరింతగా – అదనంగా మరో 10 శాతం టికెట్లు ఇవ్వాలంటూ డిమాండ్ చేసినట్లు వెల్లడైంది. ఈ డిమాండ్‌ను ఫ్రాంచైజీ తిరస్కరించగా, టికెట్లు ఇవ్వకపోతే స్టేడియంలోని కొన్ని బాక్సులకు తాళాలు వేసి సమస్యలు సృష్టించినట్లు ఆరోపణలు వచ్చాయి.వీఐపీ గ్యాలరీలు మూసివేత, పాసుల జారీ విషయంలో జాప్యం, ఇతర ఇబ్బందులతో ఫ్రాంచైజీ తీవ్రంగా నష్టపోయిందని విజిలెన్స్ నివేదిక పేర్కొంది. హెచ్‌సీఏ తమను బెదిరించిందని ఫ్రాంచైజీ మేనేజ్‌మెంట్ ఆరోపించగా, దీనికి సంబంధించి ఒక మెయిల్ కూడా బహిర్గతమైంది. పరిస్థితులు ఇలాగే కొనసాగితే తాము హైదరాబాద్‌ను వదిలి వెళ్లిపోతామని హెచ్‌సీఏకి స్పష్టం చేస్తూ ఫ్రాంచైజీ లేఖ రాసినట్లు సమాచారం.ఈ నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి విచారణకు ఆదేశించగా, తాజాగా విజిలెన్స్ విచారణ పూర్తై నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించారు. టికెట్ల అక్రమ కేటాయింపులపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందన్న దానిపై ఉత్కంఠ నెలకొంది.



## వడ్లు కొనాలని..
# కాళ్లమీద పడి..

**ఆరుగాలం శ్రమించి పంట పండించిన అన్నదాత.. ఆ పంటను అమ్ముకోవడానికి అంతకన్నా అవస్థలు పడుతున్నాడు. ఓ వైపు వానలు. మరో వైపు కొనుగోళ్లు లేక రైతులు దిక్కులు చూడాల్సి వస్తున్నది. కొనేవాళ్లు లేక ఎదురైనోళ్ల కాళ్లు మొక్కాల్సిన దుస్థితి దాపురించింది అన్నదాతకు. మా వడ్లు కొనండి అంటూ కాళ్లు పట్టుకొని బతిమిలాడిన దుర్భర పరిస్థితి రావడం దయనీయం.**

**శెనార్తి మీడియా, మహబూబాబాద్ :**

'కాళ్లు మొకుతా బాంచెన్.. మా వడ్లను కొనండి' అంటూ మహిళా రైతులు తహసీల్దార్ కాళ్లపై పడి విలపించిన ఘటన మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండ లం కేంద్రంలో చోటుచేసుకున్నది. మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ధాన్యం తడిసి మొలకెత్తింది. బుధవారం ఉదయం తిరుమల తండాకు చెందిన మహిళా రైతులు భూక్యా ఈరి, గోరి పీఏసీఎస్ కొనుగోలు కేంద్రానికి చేరుకొని తడిసిన ధాన్యాన్ని చూసి బోరున విలపించారు. తాము కొనుగోలు కేంద్రానికి ధాన్యం తెచ్చి 43 రోజులైనా ఎందు కు కొనుగోలు చేయలేదని సిబ్బందితో గొడవకుదిగారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ రమేశ్‌బాబు కొనుగోలు కేంద్రానికి చేరుకున్నారు.

కొనుగోలు కేంద్రంలో నిర్వాహకులు కాంటాలు పెట్టడం లేదని రైతులు తహసీల్దార్‌కు ఫిర్యాదుచేశారు. ధాన్యం రాశుల వద్దకు తీసుకెళ్లి తడిసిన వడ్లని చూపించి బోరున విలపించారు. 'మా గోడు వినండి.. మమ్మల్ని కాపాడండి' అంటూ తహసీల్దార్ కాలు మొకుతూ మొరపెట్టుకున్నారు. ఇంకా నాలు గు రోజులైతే మళ్లీ నారు పోయాలి.. పాత ధాన్యమే అమ్మలేకపోతే కొత్త సాగు ఎలా మొదలెడతాం?' అని వాపోయారు. తడిసిన వడ్లు కొనకుంటే ఆత్మహత్యే శరణ్యమంటూ మహిళా రైతులు రోధించిన తీరు ప్రతి ఒక్కరిని కలిచివేసింది. పైసలు ఇచ్చిన వారికే కాంటాలు పెట్టారని వాపోయారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, లేదంటే తమకు ఆత్మహత్య చేసుకోవడం తప్ప మరో మార్గం లేదని విలపించారు

## వానకాలం సాగుకు
# ప్రణాళిక సిద్ధం

**శెనార్తి మీడియా, కరీంనగర్ :**

జిల్లాలో 3.43 లక్షల ఎకరాల్లో పంటల సాగువానాకాలం ప్రారంభానికి ముందు కరీంనగర్ జిల్లా వ్యవసాయశాఖ విస్తృతంగా ప్రణాళికలు రూపొందించింది. ఇప్పటికే నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించగా, కొద్ది రోజుల్లో వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. వర్షాలు కురుస్తున్న వేళ రైతులు వానాకాలం సాగుకు సన్నద్ధమవుతున్నారు.ఈ సీజన్‌లో జిల్లాలో మొత్తం 3,43,240 ఎకరాల్లో పంటలు సాగు చేయనున్నట్టు వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఇందులో 2,76,500 ఎకరాల్లో వరి, 48,000 ఎకరాల్లో పత్తి, 4,000 ఎకరాల్లో మొక్కజొన్న, 1,000 ఎకరాల్లో కంది, 200 ఎకరాల్లో పెసర, 1,000 ఎకరాల్లో మిర్చి, 150 ఎకరాల్లో వేరుశెనగ, 13,045 ఎకరాల్లో కూరగాయలు, ఇతర ఉద్యానవన పంటలు సాగు చేయనున్నారు. అలాగే, 300 ఎకరాల్లో పొగాకు సాగు కూడా కొనసాగనుంది.ఈ సాగు కోసం అవసరమైన ఎరువులు, విత్తనాల సరఫరాకు ఏర్పాట్లు చేశారు. 43,254 మెట్రిక్ టన్నుల యూరియా, 26,957 టన్నుల కాంప్లెక్స్, 7,730 టన్నుల ఎంవోపీ, 6,945 టన్నుల డీఏపీ ఎరువులు అవసరమవుతాయని అంచనా వేసి వాటిని అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకున్నారు. అలాగే, 69,125 క్వింటాళ్ల వరి విత్తనాలు, పత్తి కోసం 88,162 ప్యాకెట్ల విత్తనాలు, ఇతర విత్తనాలుగా మొక్కజొన్న, కంది, పెసర, వేరుశెనగ విత్తనాలను కూడ సిద్ధం చేస్తున్నారు.పత్తి విత్తనాల డిమాండ్ అధికంగా ఉండటంతో ప్రతి సంవత్సరం బ్లాక్ మార్కెట్‌లో బీటీ-3 విత్తనాల అక్రమ విక్రయం జరుగుతోంది. ఈ విత్తనాలు కేంద్ర ప్రభుత్వం నుండి అనుమతి లేనివి కాగా, గ్లైఫోసిన్ వంటి కలుపు మందులను తట్టుకునేలా జన్యుమార్పులతో తయారవుతాయి. వీటి వలన పర్యావరణం, జీవవైవిధ్యంపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందని వ్యవసాయశాఖ హెచ్చరిస్తోంది.అయినప్పటికీ మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి బీటీ-3 విత్తనాలు తరలించి జిల్లా గ్రామాలలో రైతులకు అమ్ముతున్నారు. కలుపు మందులు కూడా ఆయా విత్తనాలతో పాటు విక్రయిస్తున్నారు. దీన్ని అరికట్టేందుకు వ్యవసాయశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. పత్తి రైతులు నిషేధిత విత్తనాల సాగుకు మొగ్గు చూపవద్దని, లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు.జిల్లాలో సాగు సజావుగా సాగేందుకు అవసరమైన ఎరువులు, విత్తనాల సరఫరా కోసం వ్యవసాయశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. వ్యవసాయ ఉత్పత్తి పెంచడమే లక్ష్యంగా రైతులకు మార్గనిర్దేశం చేస్తోంది.